సాక్షి తూర్పుగోదావరి

శనివారం । 14 । అక్టోబర్ । 2023



అన్నదాన భవనానికి విరాళం

ఆత్రేయపురం: వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి క్షేత్రంలో వకుళమాత అన్నదాన భవన నిర్మాణానికి నామాల వీర వెంకట సత్యనారాయణ, పద్మావతి దంపతులు (కేశవరం) శుక్రవారం రూ.1,11,116 విరాళం సమర్పించారు.



బంగారు బొమ్మ రావమ్మా..

10లో

శరన్నవరాత్ర ఉత్సవాలకు ఊరూవాడా సిద్ధమవుతున్నాయి. వినాయక చవితి వేడుకల తరహాలోనే మండపాల్లో అమ్మవారి భారీ విగ్రహాలను ప్రతిష్ఠించి తొమ్మిది రోజుల పాటు విశేష పూజలు నిర్వహించేందుకు ఉత్సవ కమిటీలు ఏర్పాట్లు చేస్తున్నాయి.

మిగులు జలాల విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి శుక్రవారం 30,365 క్యూసెక్కుల గోదావరి మిగులు జలాలను సముద్రంలోకి విడిచిపెట్టారు. అలాగే తూర్పు డెల్టాకు 4,800, మధ్య డెల్టాకు 2,300, పశ్చిమ డెల్టాకు 7 వేల క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. భద్రాచలం వద్ద 11.60, బ్యారేజీ వద్ద 10.90 అడుగులకు నీటిమట్టం చేరింది.

న్యూస్‌రీల్

కోట సత్తెమ్మ ఆలయంలో నవరాత్ర మహోత్సవాలు



ప్రత్యేక పుష్పాలంకరణలో కోట సత్తెమ్మ అమ్మవారు

నిడదవోలు రూరల్: నిడదవోలు మండలం తిమ్మరాజుపాలెంలో కోట సత్తెమ్మ అమ్మవారి ఆలయంలో దేవీ నవరాత్ర మహోత్సవాలు ఈనెల 15 నుంచి 23 వరకు వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తిచేసినట్లు ఆలయ ఈఓ బళ్ల నీలకంఠం శుక్రవారం తెలిపారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలో విద్యుత్ దీపాలంకరణలు ఏర్పాటు చేశామన్నారు. ఆదివారం ఉదయం ఆలయ ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్, ఛైర్మన్ దేవులపల్లి రవిశంకర్ దంపతుల ఆధ్వర్యంలో జరిగే కలశ స్థాపనతో ఉత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. ప్రతి రోజు అమ్మవారికి సహస్ర నామ పూజలతో పాటు ఉదయం చండీపారాయణ, సాయంత్రం హోమాలు నిర్వహిస్తారు. 20న మూలానక్షత్రం, సరస్వతి పూజ, త్రిరాత్రి పూజ, 22న దుర్గాష్టమి, 23న మహర్నవమి, విజయదశమి రోజు శమీపూజతో పాటు ప్రత్యేక సహస్రనామ పూజలు నిర్వహిస్తారు.


అర్హులకు ఉజ్వల గ్యాస్ కనెక్షన్లు



సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ మాధవీలత

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): ప్రధానమంత్రి ఉజ్వల యోజన పథకం ద్వారా నిరుపేద కుటుంబాల్లో 18 ఏళ్లు నిండిన మహిళలకు కేంద్ర ప్రభుత్వం గ్యాస్ కనెక్షన్లు అందజేయనుందని కలెక్టర్ మాధవీలత తెలిపారు. ఈ మేరకు శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో డీఆర్ఓ నరసింహులు, కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ జిల్లాలో ఈ పథకం కింద ఇప్పటి వరకూ 12,704 మంది లబ్ధిదారులున్నారన్నారు. మరికొంతమంది అర్హులకు కేటాయించేందుకు చర్యలు చేపట్టామన్నారు. తాను చైర్మన్‌గా ఉన్న జిల్లా ఉజ్వల కమిటీకి జిల్లా పౌర సరఫరాల అధికారి మెంబర్‌గా, బీపీసీఎల్ సేల్స్ ఆఫీసర్ మెంబర్ కో ఆర్డినేటర్‌గా ఉన్నారన్నారు. ఈ పథకం ద్వారా లబ్ధిదారులకు రూ.4,093 విలువైన కొత్త గ్యాస్ స్టవ్, గ్యాస్‌తో నింపిన సిలిండర్, రెగ్యులేటర్, సురక్షా ట్యూబ్, గ్యాస్ నమోదు పుస్తకం, సెక్యూరిటీ డిపాజిట్‌తో పాటుగా ఉచితంగా అందిస్తారన్నారు. అర్హులు తమ సమీప గ్యాస్ ఏజెన్సీని సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలన్నారు. సమావేశంలో పౌర సరఫరాల అధికారి బి.విజయ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రైఫిల్ షూటింగ్ ఎంపికలు



రైఫిల్ షూటింగ్ ఎంపికల్లో పాల్గొన్న విద్యార్థులు

రాజానగరం: స్కూల్ గేమ్స్‌లో భాగంగా సంపత్ నగరంలోని రాజమహేంద్రి ఇంటర్నేషనల్ స్కూల్లో శుక్రవారం రైఫిల్ షూటింగ్ ఎంపికలు జరిగాయి. మండలం విద్యాశాఖాధికారి జ్యోతిప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి వివిధ పాఠశాలల నుంచి 150 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఇక్కడ ఎంపికైనవారు ఈ నెల 28న జరిగే రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొంటారని ఎస్‌జీఎఫ్ కార్యదర్శి కేవీ స్వామి తెలిపారు. డీఈఓ ఎస్.అబ్రహం పర్యవేక్షణలో జరిగిన ఈ సెలక్షన్స్‌లో ఉప విద్యాశాఖాధికారి నారాయణ, రూరల్ ఎంఈఓ గౌరీ శంకర్, సర్వశిక్ష అభియాన్ ఏఎంఓ కె.రామారావు, ఇంటర్నేషనల్ స్కూల్ చైర్మన్ టీకే విశ్వేశ్వరరెడ్డి, డైరెక్టర్ టి.స్వరూపారెడ్డి, ప్రిన్సిపాల్ చంద్రశేఖర్, ఏలూరు డైట్ అధ్యాపకులు టి.గంగాధర్ పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత

కిర్లంపూడి: ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత, సుఖ సంతోషాలు కలుగుతాయని పిఠాపురం విశ్వవిజ్ఞాన విద్యా ఆధ్యాత్మిక పీఠాధిపతి డాక్టర్ ఉమర్ ఆలీషా అన్నారు. సోమరాయణంపేటలోని విశ్వ విజ్ఞాన విద్యా ఆధ్యాత్మిక నూతన ఆశ్రమాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు.




- పెద్దాపురానికి చెందిన డి.దుర్గాజీ కుమారుడు నవీన్ (8) మానసిక వైకల్యంతో బాధ పడుతున్నాడు. అతడికి భరోసా కల్పిస్తూ సీఎం ఆర్థిక సాయం మంజూరు చేశారు. ఈ సాయాన్ని కలెక్టర్ అందజేశారు.




- డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాకు చెందిన ఎస్.నళిని కుమార్తె శశిశ్రీనేత్ర (6) కిడ్నీ వ్యాధితో బాధ పడుతోంది. ఆమెకు ఆర్థిక సాయం మంజూరు చేశారు.




- కిర్లంపూడికి చెందిన మాధవరావు కుమారుడు టి.ఆనందకుమార్ (23) మానసిక అనారోగ్యంతో బాధ పడుతున్నాడు. ఈ యువకుడికి ఆర్థిక సాయం అందజేశారు.




- పెద్దాపురానికి చెందిన ఎస్.సీతామహాలక్ష్మి రెండేళ్ల కుమారుడు సాయికృష్ణకాంత్. గుండె సంబంధిత వ్యాధితో బాధ పడుతున్న ఈ చిన్నారి ఆరోగ్యావసరాలకు తక్షణ సాయం అందజేశారు.

జగనన్న అభయం

- కష్టాలు విని.. కన్నీరు తుడిచిన సీఎం జగన్
- 17 మంది ఆపన్నులకు ఆర్థిక సాయం
- సామర్లకోటలో అధికారులకు ఆదేశం
- 24 గంటల్లోనే రూ.లక్ష చొప్పున అందజేత
- కృతజ్ఞతలు తెలిపిన బాధిత కుటుంబ సభ్యులు

కాకినాడ సిటీ: నాయకుడంటే నమ్మకం.. నాయకుడంటే భరోసా.. నాయకుడంటే మన సున్న మనిషి.. ఈ లక్షణాలన్నీ మూర్తీభవించిన నిజమైన సారథి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి. ఊపిరి సలపని క్షణాల్లోనూ ముఖంపై చెక్కు చెదరని చిరునవ్వు ఆయన సొంతం. ఎలాంటి పరిస్థితి అయినా కష్టం వింటే చలించి.. నేనున్నానంటూ చేయూతనివ్వడం ఆయన నైజం. అందుకే నిరుపేదలు ఆయనను తమను బాధల నుంచి గట్టెక్కించే దైవంగా విశ్వసిస్తున్నారు. ఆ భావనతో కొందరు సీఎం వైఎస్ జగన్‌ను సామర్లకోటలో కలిసి, తమ కష్టాలను వివరించారు. గురువారం జగనన్న కాలనీల్లో సామూహిక గృహ ప్రవేశాలకు ప్రారంభోత్సవానికి వచ్చిన ఆయనను హెలిప్యాడ్ వద్ద కలుసుకున్నారు. తమ ఇంట్లో అనారోగ్య బాధితుల గురించి చెప్పి గోడు వెళ్లబోసుకున్నారు. అంతటి బిజీ షెడ్యూల్‌లోనూ ఆయన అన్నీ మరచి.. వారి సమస్యలను సావధానంగా ఆలకించారు. తానున్నానంటూ భరోసా ఇచ్చారు. వారి అనారోగ్య సమస్యలపై తక్షణమే స్పందించాలని కాకినాడ జిల్లా అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు. ఫలితంగా కలెక్టర్ కృతికా శుక్లా నేతృత్వంలో అధికారులు 24 గంటల్లోనే తక్షణ ఆర్థిక సాయం అందేలా పని చేశారు. వివిధ ప్రాంతాలకు చెందిన 17 మందిని తన కార్యాలయానికి కలెక్టర్ పిలిచారు.

సీఎం సహాయ నిధి నుంచి శుక్రవారం సాయంత్రం రూ.లక్ష చొప్పున వారికి ఆర్థిక సహాయం అందజేశారు. దీంతో బాధిత కుటుంబ సభ్యులు ఒక్కసారిగా ఆనందాశ్చర్యాల్లో మునిగిపోయారు. వినతి ఇచ్చిన గంటల వ్యవధిలోనే ఇలా స్పందించి ఆదుకుంటారని భావించలేదంటూ సీఎం జగన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఇందుకు సహకరించిన కలెక్టర్‌కు ధన్యవాదాలు తెలిపారు.




- డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాకు చెందిన ఐ.సత్యనారాయణ తన 18 నెలల కుమార్తె ఐనికను సీఎంకు చూపించారు. కంటికి సంబంధించి వైద్య సహాయం అందించారు.




- పెద్దాపురానికి చెందిన కసిరెడ్డి సరితశ్రీ కుమార్తె లక్ష్మీ ఆకాంక్ష (8) న్యూరో సంబంధిత వ్యాధితో సతమతమవుతోంది. ఆమెకు వైద్యం నిమిత్తం ఆర్థిక సహాయం అందించారు.




- కాకినాడకు చెందిన సింగం వెంకటలక్ష్మి కుమార్తె శ్యామల భాను (4) లుకేమియా వ్యాధితో బాధ పడుతోంది. ఈ చిన్నారి తక్షణ వైద్యానికి ఆర్థిక సాయం కలెక్టర్ అందజేశారు.

- పెద్దాపురానికి చెందిన అయినాల మాధవరావు కుమారుడు సాయి వెంకట్ (11) అనారోగ్య బాధితుడు. ఈ బాబుకు వైద్య సహాయంగా కలెక్టర్ చెక్కు అందించారు.
- కోనసీమ జిల్లాకు చెందిన పి.విజయచక్రవర్తి కుమార్తె మాధురి నవ్య (13) అనారోగ్య పీడితురాలు. ఈమె కష్టాన్ని చూసి సీఎం స్పందించారు. ఆమెకు ఆర్థిక సాయం చేశారు.
- డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాకు చెందిన జి.వీరయ్య కుమారుడు వీర వెంకట సాయి (16) లుకేమియా వ్యాధితో బాధ పడుతున్నాడు. అతడి వైద్యానికి ఆర్థిక సాయం అందజేశారు.
- కోనసీమ జిల్లాకు చెందిన సీహెచ్ దుర్గాభవాని కుమార్తె హర్షిత (15) థ్రాంబోసైటోపీనియాతో బాధ పడుతోంది. ఆమెకు ఆర్థిక సాయం అందించారు.
- కోనసీమ జిల్లాకే చెందిన జి.సుజాత (43) మీనింగోమా వ్యాధితో బాధ పడుతోంది. ఆమెకు వైద్యం నిమిత్తం కలెక్టర్ ఆర్థిక సాయం అందజేశారు.
- ఇదే జిల్లాకు చెందిన ఎస్.సతీష్ (31) విద్యుత్ షాక్‌తో వికలాంగుడయ్యాడు. అతడికి ఆర్థిక సాయం అందజేశారు.
- కోనసీమకు చెందిన పి.ప్రేమ్‌చంద్ (22) తీవ్ర అనారోగ్య బాధితుడు. ఈ యువకునికి ఆర్థిక సహాయం అందించారు.
- పెద్దాపురానికి చెందిన బుర్రా వెంకటస్వామి కుమారుడు రాజు (47) అనారోగ్యంతో కదల్లేని దుస్థితి. ఇతనికి ఆర్థిక సాయం అందజేశారు.
- పెద్దాపురానికి చెందిన పాలికల వీరభద్రుడు కుమారుడు సత్య సుబ్రహ్మణ్యానికి రెండేళ్లు. ఈ బాలుడు కిడ్నీ సంబంధ అనారోగ్యంతో బాధ పడుతున్నాడు. ఆరోగ్యశ్రీ, ఆర్థిక సాయాన్ని కలెక్టర్ అందజేశారు.

ఈవీఎంల తనిఖీ ఎంతో కీలకం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మాధవీలత

- ఈ నెల 16 నుంచి ప్రారంభం
- 140 మంది సిబ్బంది నియామకం
- తనిఖీపై శిక్షణ కార్యక్రమంలో కలెక్టర్ మాధవీలత

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): ఎన్నికల ప్రక్రియలో మొదటి దశ తనిఖీ ఎంతో కీలకమని, దానికి అనుగుణంగా రెండవ దశ తనిఖీ, తదుపరి ఓటింగ్ ప్రక్రియ ఆధారపడి ఉంటుందని కలెక్టర్ మాధవీలత అధికారులకు స్పష్టం చేశారు. కలెక్టరేట్‌లో శుక్రవారం జరిగిన ఈవీఎంల తనిఖీల శిక్షణ కార్యక్రమానికి కలెక్టర్ మాధవీలత, జేసీ తేజ్ భరత్, సహాయ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్ హాజరయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ తనిఖీ చేసే ప్రక్రియను పూర్తిగా వెబ్ కాస్టింగ్‌లో రికార్డ్ చేస్తామన్నారు. తనిఖీల శిక్షణ అనంతరం ఈ నెల 16 నుంచి 25 రోజుల పాటు బృందం తనిఖీలు చేస్తుందన్నారు. ఇందుకోసం 140 మంది సిబ్బందిని నియమించామని, ఏ ఒక్కరికీ విధుల్లో మినహాయింపు లేదన్నారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల సమక్షంలో ప్రతి రోజూ ఉదయం 9 నుంచి రాత్రి 7 గంటల వరకూ యూనిట్ల తనిఖీ ప్రక్రియ ఉంటుందన్నారు. జాయింట్ కలెక్టర్ ఎస్.తేజ్ భరత్ మాట్లాడుతూ ఎన్నికల ప్రక్రియను అత్యంత పారదర్శకంగా చేపట్టే దిశలో ఈవీఎం పరికరాలను అధీకృత బెల్ ఇంజనీర్ల దిశానిర్దేశంలో తనిఖీలు చేయనున్నట్టు తెలిపారు. జిల్లాకు 5,500 బ్యాలెట్ యూనిట్లు, 6,000 కంట్రోల్ యూనిట్, 4,950 వీవీపాట్స్ వచ్చాయన్నారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి జి.నరసింహులు, ఆర్డీవోలు ఎస్.మల్లిబాబు, ఏ.చైత్ర వర్షిణి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ తెం రాజు పాల్గొన్నారు.

టీడీపీ జనసేన కలిసినా విజయం మనదే

- వైఎస్సార్ సీపీ ప్రాంతీయ సమన్వయ కర్త పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి
- కొవ్వూరు పార్టీ సమావేశంలో పాల్గొన్న నాయకులు



కొవ్వూరులో నిర్వహించిన వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ప్రాంతీయ సమన్వయకర్త పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి. చిత్రంలో హోంమంత్రి వనిత, మరో రీజనల్ కో ఆర్డినేటర్ పిల్లి సుభాష్ చంద్రబోస్, ఎంపీ భరత్ రామ్, జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా

కొవ్వూరు: ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొని పార్టీ అధికారంలోకి రావడం కోసం కష్టపడిన ప్రతి కార్యకర్త, నాయకుడిని గుర్తిస్తామని వైఎస్సార్ సీపీ ప్రాంతీయ సమన్వయకర్త పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి చెప్పారు. కొవ్వూరులో శుక్రవారం హోం మంత్రి తానేటి వనిత అధ్యక్షతన జరిగిన నియోజకవర్గం పార్టీ శ్రేణుల సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీలో కార్యకర్తలు, నాయకులు కష్టంతోనే అధికారంలోకి వచ్చామని మిథున్‌రెడ్డి పేర్కొన్నారు. పార్టీ పరంగా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. వైఎస్సార్ సీపీ పాలనలో సంక్షేమ పథకాల ద్వారా జరిగిన మేలు గురించి ప్రజలకు వివరించి చేరువ కావాలన్నారు. త్వరలోనే పార్టీ ఆధ్వర్యంలో బస్సు యాత్ర ప్రారంభమవుతుందని తెలిపారు. టీడీపీ, జనసేన కలిసినా ఉభయ గోదావరి జిల్లాల్లో విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఉభయ గోదావరి జిల్లాల మరో రీజినల్ కో ఆర్డినేటర్ పిల్లి సుభాష్ చంద్రబోస్ మాట్లాడుతూ విపక్షాల ఎత్తులను పార్టీ శ్రేణులు చిత్తు చేయాలని సూచించారు. వైఎస్సార్ సీపీ పాలనలో అన్ని వర్గాలకూ పథకాలతో లబ్ధి చేకూరిందన్నారు. పథకాలకు ప్రభుత్వం రూ.2.35 లక్షల కోట్లు వెచ్చించిందన్నారు. ఒక్క వ్యవసాయ రంగంపైనే రూ.1.35 లక్షల కోట్లు ఖర్చు చేసిందన్నారు. హోం మంత్రి తానేటి వనిత మాట్లాడుతూ కలిసికట్టుగా పనిచేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. జగనన్న ఆరోగ్య సురక్ష అమలుపై నాయకులు ప్రత్యేక వహించాలని సూచించారు. సంక్షేమ పథకాల ద్వారా చేకూరిన లబ్ధిని ప్రజలకు వివరించాలన్నారు.

ఎన్నికలకు సన్నద్ధం కండి

ఎన్నికలకు పార్టీ శ్రేణులు సమయాత్తం కావాలని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా సూచించారు. నాయకులంతా సమష్టిగా పార్టీ విజయం కోసం కృషి చేయాలన్నారు. లంచాలకు ఆస్కారం లేకుండా తలుపుతట్టి మరీ ప్రభుత్వం పథకాల ఫలాలు అందిస్తున్న సంగతిని ప్రజలకు వివరించాలన్నారు. ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ఆశయాలకు అనుగుణంగా వైనాట్ 175 విజయం కోసం కష్టపడి పనిచేయాలన్నారు. ఎంపీ భరత్ రామ్ మాట్లాడుతూ విజయమే లక్ష్యంగా పార్టీ శ్రేణులు పనిచేయాలని సూచించారు. కార్యకర్తల్నీ విస్మరించే పరిస్థితి ఉండదన్నారు. గ్రామ, వార్డు స్థాయి నుంచి పార్టీలో అందరూ వ్యూహాత్మకంగా పనిచేయాలని రాష్ట్ర పరిశ్రమలు, మౌలిక సదుపాయాల కల్పన ప్రభుత్వ సలహాదారుడు ఎస్.రాజీవ్ కృష్ణ సూచించారు. పార్టీ యువజన విభాగం రీజినల్ కో ఆర్డినేటర్ జక్కంపూడి గణేష్ మాట్లాడుతూ 2024లో ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయపతాకం ఎగురవేయాలన్నారు. సమావేశంలో పార్టీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు చొటుపల్లి వీరన్న, మాజీ ఎమ్మెల్సీ కోడూరి శివరామకృష్ణ, మునిసిపల్ చైర్ పర్సన్ బావన రత్నకుమారి, ఎంపీపీలు కాకర్ల సత్యనారాయణ, మట్టా వీరస్వామి, జొన్నకూటి పోసిరాజు, జెడ్పీ వైస్ చైర్ పర్సన్ పోసిన శ్రీలేఖ, జెడ్పీటీసీ సభ్యురాలు బొంతా వెంకటలక్ష్మి, మాజీ ఏఎంసీ చైర్మన్ బండి పట్టాభి రామారావు, మండల పార్టీ అధ్యక్షులు సుంకర సత్యనారాయణ, చెల్లింకుల దుర్గా మల్లేశ్వరరావు, కాకర్ల వెంకటేశ్వరరావు,రాష్ట్ర రైతు విభాగం ప్రధాన కార్యదర్శి ఆత్కూరి దొరయ్య పాల్గొన్నారు.

ఖరీఫ్ వరి కోతలు ప్రారంభం

- జిల్లాలో 70 వేల హెక్టార్లలో సాగు
- ప్రస్తుతం 130 హెక్టార్లలో కోతలు
- నెలాఖరు నుంచి ముమ్మరంగా సాగే అవకాశం



రాజానగరం మండలం కలవచర్లలో వరిపంటను కోస్తున్న యంత్రం

రాజానగరం: జిల్లాలో ఖరీఫ్ వరికోతలు ప్రారంభమయ్యాయి. వర్షాభావ ప్రభావంతో కాస్త ఆలస్యంగా నాట్లు వేసినా, చీడపీడల బెడద లేకుండా ఆశించిన దిగుబడులు వస్తున్న నేపథ్యంలో అన్నదాతలు ఆనందంగా ఉన్నారు. అవసరం మేరకే నీటిని సరఫరా చేసినట్టుగా వరుణుడు అడపాదడపా కురిపించిన చినుకులు పంటకు తెగుళ్లు ఆశించకుండా నిరోధించాయని అంటున్నారు. జిల్లాలో 70 వేల హెక్టార్లలో ఖరీఫ్ వరి సాగు చేశారు. కొవ్వూరు, చాగల్లు, నల్లజర్ల, నిడదవోలు, నరేంద్రపురం, కలవచర్ల మున్నగు ప్రాంతాలలోని 130 హెక్టార్లలో ప్రస్తుతం కోతలు ప్రారంభమయ్యాయి. యంత్రాల సాయంతో జరుగుతున్న ఈ వరి కోతలు నెలాఖరు నుంచి ముమ్మరంగా జరిగే అవకాశాలున్నాయి. ప్రస్తుతం జరుగుతున్న వరి కోతలు ఎక్కువగా ఆర్‌పీ 126 వరి వంగడాన్ని సాగు చేసిన పొలాల్లోనే జరుగుతున్నాయి. ఈ రకం ధాన్యానికి బయట మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉండటంతో వ్యాపారులు పొలాలకే వచ్చి బస్తా రూ. 1400 ధరకు కొనుగోలు చేస్తున్నారు. తెగుళ్ల బెడద పెద్దగా లేకపోవడంతో ఎకరాకు 35 బస్తాలకు పైబడి దిగుబడి వస్తుందని రైతులు చెబుతున్నారు. గత ఏడాదిలో ఈ దిగుబడి 32 బస్తాలే ఉంది.

4.49 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి అంచనా



జిల్లాలో ఖరీఫ్ వరిపంట దిగుబడి 4.49 లక్షల మెట్రిక్ టన్నుల వరకూ ఉంటుందని అంచనా. ప్రస్తుతం కొవ్వూరు, చాగల్లు, నల్లజర్ల, నిడదవోలు, నరేంద్రపురం, కలవచర్ల మున్నగు ప్రాంతాలలో వరి పంట కోతలు ప్రారంభమయ్యాయి. ఇది కూడా ఎక్కువగా ఆర్‌పీ 126 వరి వంగడాన్ని సాగు చేసిన పొలాలలోనే జరుగుతున్నాయి. ఈ రకం ధాన్యానికి బయట మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది. నెలాఖరు నుంచి వరికోతలు ముమ్మరంగా జరగవచ్చు.

– ఎస్. మాధవరావు, జిల్లా వ్యవసాయశాఖ అధికారి

16న వికాసలో జాబ్‌మేళా

కాకినాడ సిటీ: వికాస కార్యాలయంలో ఈనెల 16న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ప్రాజెక్టు డైరెక్టర్ కె లచ్చారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దేవి ఆక్వా ఫీడ్స్ కంపెనీలో ట్రైనీ, ఫ్లూయిన్ టు కంపెనీలో బిజినెస్ డెవలప్‌మెంట్ అసోసియేట్, డెక్కన్ కెమికల్స్ కంపెనీలో ట్రైనీ ప్రొడక్షన్, నిట్ ఐసీఐసీఐ బ్యాంక్‌లో రిలేషన్ షిప్ మేనేజర్, సోలార్ యాక్టివ్ ఫార్మాసైన్సెస్‌లో ప్రొడక్షన్ టెక్నీషియన్, రిలయన్స్ రిటైల్స్‌లో పికింగ్ అండ్ ప్యాకింగ్, డిక్సాన్, హోండాయ్ మోబీస్, అపోలో టైర్స్ కంపెనీల్లో టెక్నీషియన్ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్, ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ, బీటెక్ ఉత్తీర్ణులైన 35 ఏళ్లలోపు అభ్యర్థులు అర్హులన్నారు. నెలకు రూ.12 వేల నుంచి రూ.25 వేల వరకు జీతం, ఇన్సెంటివ్స్, భోజనం, వసతి, రవాణా సౌకర్యం ఆయా ఉద్యోగాలను బట్టి ఉంటుందన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు 16న కలెక్టరేట్ ఆవరణ లోని వికాస కార్యాలయం వద్ద ఉదయం 9 గంటలకు హాజరు కావాలన్నారు.

క్లుప్తంగా

యువకుడి ఆత్మహత్య

నల్లజర్ల: ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన పోతవరంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన రైతు కాసాని సురేష్ (32) తన వ్యవసాయ క్షేత్రంలో శుక్రవారం ఉదయం ఆత్మహత్య చేసుకున్నాడు. పరిసర రైతులు అందించిన సమాచారంతో ఎస్సై బి.నరసింహమూర్తి సంఘటన స్థలాన్ని పరిశీలించారు. సురేష్‌ది ఆత్మహత్యేనని నిర్ధారించి కేసు నమోదు చేశారు. సురేష్ తండ్రి వెంకటేశ్వరావు చిన్నప్పుడే చనిపోయాడు. దీంతో సురేష్, అతడి తల్లి నాగమణి పోతవరంలోని అమ్మమ్మ చెరుకూరి సావిత్రి వద్ద ఉంటున్నారు. అతడికి ఇటీవల రెండుసార్లు ప్రమాదాలు జరిగి, ఆపరేషన్లు అయ్యాయి. ఆ తర్వాత స్కిన్ ఎలర్జీతో పాటు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నాడు. ఈ కారణంగానే ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని స్థానికులు చెబుతున్నారు. అయితే అమ్మమ్మ ఇచ్చిన 1.30 ఎకరా పొలానికి సంబంధించి కొంత మంది అభ్యంతరాలు తెలిపినందువల్లనే అతడు మనస్తాపంతో ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని మరికొందరు చెబుతున్నారు.

విజేతలకు బహుమతి ప్రదానం



రోల్‌ప్లే, జానపద నృత్య పోటీల్లో ప్రథమ స్థానం విజేతలతో డైట్ ప్రిన్సిపాల్ రమణ

రాజమహేంద్రవరం రూరల్: రోల్ ప్లే, జానపద నృత్య పోటీల్లో విజేతలకు శుక్రవారం సర్టిఫికెట్లు, నగదు బహుమతులను బొమ్మూరులోని జిల్లా ప్రభుత్వ విద్యా శిక్షణ సంస్థ (డైట్) ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్‌డీవీ రమణ చేతుల మీదుగా అందజేశారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా స్థాయిలో రెండు రోజుల పాటు ఈ పోటీలు నిర్వహించారు. రోల్ ప్లేలో ప్రథమ స్థానాన్ని కడియం జెడ్పీ హైస్కూల్ విద్యార్థినులు పవిత్ర, జయశ్రీ, యశస్విని, లేఖిని ప్రియ, ద్వితీయ స్థానాన్ని బొమ్మూరు ఎంజేపీ ఏపీ బీసీ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ విద్యార్థినులు పి.సంధ్యారాణి, పి.బాలాకుమారి, కె.గౌతమి, కె.పావని, శివనందేశ్వరి, తృతీయ స్థానాన్ని కేశవరం జెడ్పీ హైస్కూల్ విద్యార్థినులు డి.జాహ్నవి, దివ్యకీర్తన, కె.భార్గవి, కేటీఎస్ఎస్ లక్ష్మి కైవసం చేసుకున్నారు. జానపద నృత్య పోటీల్లో బొమ్మూరు ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికోన్నత పాఠశాల విద్యార్థినులు శైలజ, ప్రియ, అర్చన, ధావన దీప్తి, సంజన శుభశ్రీ, ఏంజేపీ ఏపీ బీసీ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ విద్యార్థినులు రేష్మశ్రీ, రమ్యశ్రీ, టీనా జెస్సికా, కీర్తిమంజు, హేమసుధ, తృతీయ స్థానాన్ని వసలపూడి ఎస్సీ హెచ్ఎస్ఆర్ జెడ్పీ హైస్కూల్ విద్యార్థినులు బి.ప్రియ, సంజన, గీత, మణికంఠరెడ్డి కైవసం చేసుకున్నారు. రోల్‌ప్లే, జానపద నృత్య పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థినులందరూ త్వరలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు హాజరు కావాలని ప్రిన్సిపాల్ రమణ తెలిపారు.

చందువా.. చందువా.. ఒక్కసారి తిందువా..



3 కిలోల నల్ల చందువా చేపతో మురమళ్లకు చెందిన నూకరాజు

సముద్రపు ఉప్పు నీటిలో పెరిగే చందువా రకం చేపలంటే మాంసాహార ప్రియులకు ఎంతో ప్రీతి. దీని రుచే వేరని అంటారు వారు. అందులోనూ కిలోకు పైబడిన బరువు కలిగిన నల్ల చందువా చేప అంటే లొట్టలేసుకుని మరీ తింటారు. అందుకే కోనసీమ జిల్లా వాసులు తెల్లావారేసరికి కాకినాడ కుంభాషేకం రేవుకు వస్తూంటారు. నల్ల చందువ, కొయ్యంగ, పండుగొప్ప చేపలను వారు ఎక్కువగా ఇష్టపడతారు. చిన్న సైజు నుంచి మూడు కిలోల వరకూ బరువు తూగే నల్ల చందువా చేపలు ప్రస్తుతం సాగర జలాల్లో లభిస్తున్నాయి. కిలో సైజు చందువ చేపలను రూ.500 నుంచి రూ.600 వరకూ కొనుగోలు చేస్తున్నారు.

– కాకినాడ రూరల్

బంగారు బొమ్మ రావమ్మా..

- చవితి వేడుకల తరహాలో శరన్నవరాత్ర ఉత్సవాలు
- ఆకట్టుకుంటున్న అమ్మవారి విగ్రహాలు
- తీర్చిదిద్దుతున్న స్థానిక కళాకారులు



ఉత్సవాలకు ముస్తాబైన అమ్మవారి విగ్రహాలు



విజయవాడ కనకదుర్గమ్మ తల్లే దిగివచ్చినట్టు..

మండపేట: శరన్నవరాత్ర ఉత్సవాలకు ఊరూవాడా సిద్ధమవుతున్నాయి. వినాయక చవితి వేడుకల తరహాలోనే ప్రత్యేక మండపాల్లో అమ్మవారి భారీ విగ్రహాలను ప్రతిష్ఠించి తొమ్మిది రోజుల పాటు విశేష పూజలు నిర్వహించేందుకు ఉత్సవ కమిటీలు ఏర్పాట్లు చేస్తున్నాయి. దీనికి తగినట్టుగానే అమ్మవారి విగ్రహాలను కళాకారులు బంగారు బొమ్మల్లా తీర్చిదిద్దుతున్నారు. గత ఏడాదితో పోలిస్తే ఈసారి అమ్మవారి విగ్రహాలకు ఎక్కువగా ఆర్డర్లు వచ్చాయని చెబుతున్నారు.

దేవీ నవరాత్ర ఉత్సవాల సందర్భంగా గతంలో ఆలయాల వద్ద అమ్మవారి చిత్రపటాలు, చిన్నచిన్న ప్రతిమలు ప్రతిష్ఠించి పూజలు నిర్వహించేవారు. కాగా ఏటా భవానీ మాలధారుల సంఖ్య పెరుగుతూండటం ఉత్సవాలకు సరికొత్త శోభను తీసుకువస్తోంది. గణపతి నవరాత్ర ఉత్సవాల మాదిరిగా అమ్మవారి భారీ విగ్రహాల ఏర్పాటుకు ఉత్సవ కమిటీలు ప్రాధాన్యం ఇస్తున్నాయి. అమ్మవారి ఆలయాలతో పాటు పలు ప్రాంతాల్లో ప్రత్యేకంగా మండపాలు ఏర్పాటు చేసి మరీ దేవీ నవరాత్ర ఉత్సవాలు అట్టహాసంగా నిర్వహిస్తున్నారు. మండపాల్లో అమ్మవారికి తొమ్మిది రోజుల పాటు పూజలు చేసిన అనంతరం నదులు, చెరువుల్లో నిమజ్జనం చేస్తున్నారు. ఈ ఏడాది శరన్నవరాత్ర ఉత్సవాలు ఆదివారం ఆరంభం కానున్నాయి. దీనికి ఉత్సవ కమిటీలు ఘనంగా ఏర్పాట్లు చేస్తున్నాయి.

దైవకళ ఉట్టిపడేలా..

నవరాత్ర ఉత్సవాలను పురస్కరించుకుని వినాయకుని విగ్రహాల తరహాలో మండపాల్లో ప్రతిష్ఠించేందుకు ఐదు నుంచి 15 అడుగుల ఎత్తు వరకూ అమ్మవారి విగ్రహాలను దైవకళ ఉట్టిపడేలా తయారు చేస్తున్నారు. సాధారణంగా వినాయక విగ్రహాలను అధికంగా బెంగాలీ కళాకారులు తయారు చేస్తూంటారు. వారికున్న సెంటిమెంటు రీత్యా అమ్మవారి విగ్రహాల తయారీకి ముందుకు రాకపోవడంతో స్థానిక కళాకారులే వీటిని తయారు చేస్తున్నారు. మండపేట మండలం జెడ్.మేడపాడు వంతెన వద్ద, మండపేట బైపాస్ రోడ్డులోని టోల్‌గేట్ వద్ద విగ్రహాల తయారీ జోరుగా సాగుతోంది. పులి వాహనం, సింహ వాహనం, విజయవాడ దుర్గమ్మ తదితర రూపాల్లో రూపుదిద్దుకున్న అమ్మవారి విగ్రహాలు.. చూడగానే భక్తిభావం పొంగి పొరలేలా ఎంతో ఆకట్టుకుంటున్నాయి. పర్యావరణానికి హాని కలగని రీతిలో ఈ బొమ్మలు తయారు చేస్తున్నామని కళాకారులు తెలిపారు. విగ్రహం సైజు, మోడల్‌ను బట్టి రూ.1,000 నుంచి రూ.18,000 వరకూ విక్రయిస్తున్నారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని వివిధ గ్రామాలతో పాటు విజయవాడ, యలమంచిలి, జంగారెడ్డిగూడెం తదితర ప్రాంతాల నుంచి కూడా ఉత్సవ కమిటీ సభ్యులు వచ్చి విగ్రహాలు తీసుకువెళుతున్నారని చెబుతున్నారు.

15 అడుగుల వరకూ తయారీ



అడుగు నుంచి 15 అడుగుల ఎత్తు వరకూ అమ్మవారి బొమ్మలు తయారు చేస్తున్నాం. ప్రకృతికి హాని కలిగించని రంగులు మాత్రమే వినియోగిస్తాం. సైజు, మోడల్‌ను బట్టి బొమ్మ ధర ఉంటుంది. ఉత్సవ కమిటీల ఆర్డరుపై 20 అడుగుల వరకూ కూడా విగ్రహాలు తయారు చేస్తూంటాం.

– ఎం.చంద్రరావు, బొమ్మల తయారీ కళాకారుడు, మండపేట

ఏటా ఆర్డర్లు పెరుగుతున్నాయి



శరన్నవరాత్ర ఉత్సవాలు సందర్భంగా అమ్మవారి విగ్రహాల తయారీ కోసం వస్తున్న ఆర్డర్లు ప్రతి ఏటా పెరుగుతున్నాయి. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది అధికంగా ఆర్డర్లు వచ్చాయి. జిల్లాతో పాటు ఇతర జిల్లాలకు కూడా మండపేట నుంచి విగ్రహాలను పంపిస్తున్నాం.

– ఎ.నాగేశ్వరరావు, బొమ్మల తయారీ కళాకారుడు, ద్వారపూడి

మొసలిని పట్టాలని..



మొసలిని పట్టుకునేందుకు సిద్ధం చేసిన బోను



మొసలిని బంధించేందుకు కాలువలో అడ్డుగా వల వేస్తున్న రెస్క్యూ టీమ్

- కాలువలో జల్లెడ పడుతున్న సిబ్బంది
- వలలతో అడ్డుకట్ట.. బోను ఏర్పాటు

అమలాపురం టౌన్: మొసలి సంచరిస్తోందన్న సమాచారంతో అప్రమత్తమైన మున్సిపల్, అటవీ, జలవనరుల శాఖల అధికారులు అమలాపురం ప్రధాన పంట కాలువలో గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. ఈ కాలువలో అమలాపురంలో సమీపంలోని నడిపూడి లాకుల నుంచి పట్టణంలోని ఎర్ర వంతెన వరకూ దాదాపు రెండు కిలోమీటర్ల పరిధిలో మొసలి సంచరిస్తున్నట్టు స్థానికులు గుర్తించారు. దీంతో ఈ మూడు శాఖల అధికారులు రంగంలోకి దిగారు. మొసలిని పట్టుకునే వరకూ ఎవ్వరూ కాలువలో దిగవద్దని హెచ్చరికలు జారీ చేశారు. జిల్లా అటవీ శాఖ అధికారి ఎంవీవీ ప్రసాదరావు, జలవనరుల శాఖ డీఈ రాంబాబు, రేంజ్ అధికారి హరికుమార్, అటవీ సిబ్బంది ఎ.రవికిరణ్, ఆర్‌వీ రమణ, శివప్రసాద్, ఉప్పు శ్రీను ఆధ్వర్యాన మొసలి ఆచూకీ కోసం నాలుగు రోజులుగా కాలువలో గాలింపు చర్యలు చేపట్టారు. మున్సిపల్ కమిషనర్ ఒమ్మి అయ్యప్ప నాయుడు పట్టణ ప్రజలను అప్రమత్తం చేస్తూ రోజూ పర్యవేక్షిస్తున్నారు. మొసలి ఆచూకీని కనిపెట్టేందుకు కాలువలో నీటిమట్టాన్ని బాగా తగ్గించారు. మారేడుమిల్లి నుంచి మొసలి పట్టే బోనును, వలలను శుక్రవారం రప్పించారు. రెస్క్యూ టీమును కూడా రంగంలోకి దింపారు. స్థానిక ఎర్ర వంతెన సమీపాన కాలువ ప్రవాహానికి అడ్డుగా వల కట్టారు. ప్రస్తుతానికి మొసలి జాడ ఎక్కడా కనిపించలేదని అటవీ శాఖ అధికారులు తెలిపారు. ఈ అన్వేషణ మరో రెండు రోజులు కొనసాగనుంది.

సర్ప మీనాలు



ఈ చిత్రంలో కనిపిస్తున్నవి పాములనుకునేరు.. పరాకుగా చూస్తే పాములు గుంపుగా పాకుతూ వెళుతున్నట్టు కనిపిస్తున్నా.. ఇవో రకం సముద్రపు చేపలు. స్థానిక మత్స్యకారులు వీటిని తెల్ల పాము చేపలని పిలుస్తూంటారు. వీటి పొట్ట భాగంలోని బ్లాడర్‌కు మంచి డిమాండ్ ఉంది. మందుల తయారీలో వినియోగించే ఈ బ్లాడర్‌ను చేప నుంచి విడదీసి ఫార్మా కంపెనీలకు విక్రయిస్తారు. కాకినాడ కుంభాభిషేకం వద్ద ఈ తెల్ల పాము రకం చేపలను విక్రయించేందుకు మత్స్యకారులు ఇలా పేర్చారు.

– కాకినాడ రూరల్

ఓపెన్ స్కూల్ ప్రవేశాలకు నెలాఖరు వరకూ గడువు

రాయవరం/కంబాలచెరువు (రాజమహేంద్రవరం): ఓపెన్ స్కూల్ పదో తరగతి, ఇంటర్మీడియెట్‌లో ప్రస్తుత విద్యా సంవత్సరంలో ప్రవేశాలకు ఈ నెల 31 వరకూ అపరాధ రుసుం లేకుండా ఫీజు చెల్లించవచ్చు. కాకినాడ, తూర్పు గోదావరి జిల్లాల విద్యాశాఖాధికారులు జి.నాగమణి, ఎస్.అబ్రహం శుక్రవారం వేర్వేరు ప్రకటనల్లో ఈ విషయం తెలిపారు. పదో తరగతిలో అడ్మిషన్ పొందే ఓసీ విద్యార్థులు రిజిస్ట్రేషన్ ఫీజు రూ.100, అడ్మిషన్ ఫీజు రూ.1,450 చెల్లించాలి. అన్ని వర్గాల స్త్రీలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, పీహెచ్‌సీ పురుషులు రిజిస్ట్రేషన్ ఫీజు రూ.100, అడ్మిషన్ ఫీజు రూ.1,050 చెల్లించాలి. ఇంటర్మీడియెట్ అడ్మిషన్‌కు ఓసీ పురుషులు రిజిస్ట్రేషన్ ఫీజు రూ.200, అడ్మిషన్ ఫీజు రూ.1,600, అలాగే అన్ని వర్గాల స్త్రీలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, పీహెచ్‌సీ పురుషులు రిజిస్ట్రేషన్ ఫీజు రూ.200, అడ్మిషన్ ఫీజు రూ.1,300 చెల్లించాల్సి ఉందని అధికారులు వివరించారు. ప్రాస్పెక్టస్ కం అప్లికేషన్ ఫారాన్ని సంబంధిత స్టడీ సెంటర్ నుంచి ఉచితంగా పొంది, వివరాలు పూరించి, తప్పులేవైనా ఉంటే సంబంధిత కో ఆర్డినేటర్ ద్వారా సరి చూసుకుని, ఏపీ ఆన్‌లైన్ కేంద్రం ద్వారా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. ఆన్‌లైన్ అప్లికేషన్ జిరాక్స్ కాపీ, ఫీజు రశీదును సంబంధిత ఏఐ కేంద్రంలో ఇవ్వాలన్నారు. విధిగా 30 రోజులు తరగతులకు హాజరు కావాల్సి ఉంటుందన్నారు. స్టడీ సెంటర్‌లో ఎటువంటి ఫీజులూ చెల్లించాల్సిన అవసరం లేదని, దళారులను నమ్మవద్దని స్పష్టం చేశారు. వివరాలకు సమీప ఏఐ కేంద్రాలను లేదా జిల్లా కో ఆర్డినేటర్‌ను 89776 45704 నంబరులో సంప్రదించాలని నాగమణి, అబ్రహం తెలిపారు.

జీఎస్‌ఎల్‌లో వుమెన్ మెడికోస్ గేమ్స్ మీట్



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న డాక్టర్ గన్ని భాస్కరరావు

రాజానగరం: శరీర దారుఢ్యానికే కాకుండా బుద్ధి వికాసానికి, మానసిక ప్రశాంతతకు, ధైర్యానికి క్రీడలు తోడ్పడతాయని జీఎస్‌ఎల్ విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ గన్ని భాస్కరరావు అన్నారు. డాక్టర్ వైఎస్సార్ హెల్త్ యూనివర్సిటీ పరిధిలోని మెడికల్, డెంటల్ కళాశాలల విద్యార్థినులకు వుమెన్ మెడికోస్ గేమ్స్ మీట్‌ను జీఎస్‌ఎల్ వైద్య కళాశాల క్రీడా మైదానంలో శుక్రవారం ఆయన లాంఛనంగా ప్రారంభించారు. వాలీబాల్, బాస్కెట్‌బాల్, త్రోబాల్, షటిల్ బ్యాడ్మింటన్, బాల్ బ్యాడ్మింటన్, టెన్నిస్, టేబుల్ టెన్నిస్, చెస్ ఆటల్లో 19 కళాశాలల నుంచి 450 మంది విద్యార్థినులు పోటీ పడుతున్నారు. తొలి రోజు త్రోబాల్‌లో ఏలూరు ఆశ్రమ్ కళాశాలపై జీఎస్‌ఎల్ వైద్య కళాశాల విజయం సాధించింది. అలాగే విజయవాడ సిద్ధార్థ మెడికల్ కాలేజీపై విజయనగరం మహారాజా మెడికల్ కాలేజీ, రాజమహేంద్రవరం లెనోరా డెంటల్ కాలేజీపై గుంటూరు మెడికల్ కాలేజీ జట్లు గెలుపొందాయి. టేబుల్ టెన్నిస్ పోటీలు 5 రౌండ్లలో జరిగాయి. వీటిలో ఏలూరు సెయింట్ జోసెఫ్ డెంటల్ కాలేజీపై విజయనగరం మహారాజా కాలేజీ, విశాఖలోని అనిల్ నీరుకొండ డెంటల్ కాలేజీపై తిరుపతి ఎస్వీ మెడికల్ కాలేజీ, విశాఖ ఎన్ఆర్ఐ మెడికల్ కాలేజీపై విజయవాడ సిద్ధార్థ కాలేజీ, శ్రీకాకుళం జెమ్స్ మెడికల్ కాలేజీపై రాజమహేంద్రవరం జీఎస్‌ఎల్ డెంటల్ కాలేజీ, విజయవాడ సిద్ధార్థ కాలేజీపై జీఎస్‌ఎల్ మెడికల్ కాలేజీ జట్లు విజయం సాధించాయని పీడీ శ్రీనివాసులు వివరించారు. వాలీబాల్, బాస్కెట్‌బాల్, చెస్, టెన్నిస్ పోటీలు జరుగుతున్నాయని యూనివర్సిటీ స్పోర్ట్స్ బోర్డు కార్యదర్శి డాక్టర్ ఇ.త్రిమూర్తి చెప్పారు.

ఫుడ్ టెక్నాలజీ కోర్సుకు అధ్యాపకుల నియామకం



ఫుడ్ టెక్నాలజీ కోర్సు హెచ్‌ఓడీగా డాక్టర్ కల్యాణికి ఉత్తర్వులు అందిస్తున్న వీసీ ఆచార్య పద్మరాజు. చిత్రంలో ఆచార్య రామకృష్ణ తదితరులు

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీలో కొత్తగా ప్రారంభించిన ఎమ్మెస్సీ ఫుడ్ టెక్నాలజీ కోర్సుకు అనుభవజ్ఞులైన అధ్యాపకులను నియమిస్తున్నామని ఉప కులపతి ఆచార్య కె.పద్మరాజు తెలిపారు. ఈ కోర్సుకు విద్యార్థుల నుంచి అపూర్వ స్పందన వస్తున్నందున హెచ్‌ఓడీగా డాక్టర్ డి.కల్యాణిని నియమించారు. ప్రస్తుతం ఆమె జువాలజీ విభాగంలో సహాధ్యాపకురాలిగా విధులు నిర్వహిస్తున్నారు. అలాగే ఫుడ్ ప్రాసెసింగ్‌లో 42 సంవత్సరాల అనుభవం గడించిన విశ్రాంత ఆచార్యుడు పి.రామకృష్ణను అధ్యాపకునిగా నియమించారు. వీరిద్దరికీ వీసీ ఆచార్య పద్మరాజు శుక్రవారం నియామక ఉత్తర్వులు అందజేశారు.

ఆ త్యాగం.. పలువురికి ప్రాణదీపం

- బ్రెయిన్ డెడ్ అయిన మహిళ అవయవ దానం
- ముందుకు వచ్చిన కుటుంబ సభ్యులు



అవయవ దాత రాజారపు నాగమణి

కాకినాడ రూరల్: ఏం చేసినా తమ ఇంటి దీపం కొడిగట్టిపోతోందని అర్థం చేసుకున్న వారు.. పుట్టెడు దుఃఖాన్ని దిగమింగుకుని.. అవయవాలు దానం చేసి.. పలువురిలో ప్రాణదీపం వెలిగించారు. మానవతా దృక్పథంతో పదిమందికి ఆదర్శంగా నిలిచారు. వివరాలివీ.. కాకినాడకు చెందిన రాజారపు నాగమణి (68) అధిక బ్లడ్ ప్రెజర్(బీపీ)తో ఈ నెల 7న ప్రైవేటు ఆసుపత్రిలో చేరింది. బ్రెయిన్‌లో రక్తస్రావం కావడం, వైద్యం చేసినప్పటికీ శరీరం సహకరించపోవడంతో వైద్యులు బ్రెయిన్ డెడ్‌గా నిర్ధారించారు. దీంతో ఆమె భర్త వెంకట శేషగిరిరావు (చిట్టిబాబు), కుమారులు మహేష్, కృష్ణ, నారాయణమూర్తి, మాజీ కార్పొరేటర్ వెంకటలక్ష్మి తదితరులు నాగమణి అవయవాలు దానం చేసేందుకు ముందుకు వచ్చారు. ఈ నేపథ్యంలో ఆమెను ట్రస్ట్ ఆసుపత్రికి తీసుకువచ్చారు. ఇక్కడి వైద్యులు శుక్రవారం నాగమణి కిడ్నీలు, కళ్లు సేకరించారు. ఒక కిడ్నీని ట్రస్ట్ ఆసుపత్రిలోని బాధితుడికి కేటాయించారు. మరో కిడ్నీని విశాఖపట్నంలోని అపోలో ఆసుపత్రిలో ఉన్న మరో బాధితుడి కోసం రాత్రి 7.30 గంటలకు తరలించారు. కళ్లలోని కార్నియాను కాకినాడ బాదం బాలకృష్ణ ఐ బ్యాంక్‌కు అప్పగించారు. అవయవ దానానికి సేఫ్ ఆస్పత్రి అధినేత డాక్టర్ ఆనంద్ ప్రోత్సహించారని, కాకినాడ ఎంపీ వంగా గీత, కాకినాడ రూరల్, సిటీ ఎమ్మెల్యేలు కురసాల కన్నబాబు, ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి తమకు అండగా నిలిచారని నాగమణి కుటుంబ సభ్యులు తెలిపారు.

దసరా వేళ.. పారా హుషార్

- సెలవులకు ఊరెళ్తే జాగ్రత్తలు పాటించాలి
- పోలీసు యంత్రాంగం సూచనలు

మండపేట: దసరా సెలవుల నేపథ్యంలో చోరీలు జరగకుండా అడ్డుకట్ట వేసేందుకు పోలీసు యంత్రాంగం చర్యలు చేపట్టింది. సెలవులు ఎంజాయ్ చేసేందుకు కుటుంబ సమేతంగా ఇతర ప్రాంతాలకు వెళ్లే వారిని అప్రమత్తం చేస్తూ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పోలీసు కార్యాలయం శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేసింది. చోరీలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు చేసింది. వీటిపై పోలీసు అధికారులు సామాజిక మాధ్యమాల ద్వారా విస్తృత ప్రచారం చేస్తూ చోరీల కట్టడికి సహకరించాలని కోరుతున్నారు.

ఈ జాగ్రత్తలు తీసుకోండి

- ఇంటికి తాళం వేసుకుని ఊళ్లు వెళ్లే వారు సమీప పోలీస్ స్టేషన్‌లో సమాచారం తెలియజేయాలి. దీనివలన రాత్రి వేళల్లో గస్తీ తిరిగే పోలీసులు ప్రత్యేక నిఘా ఉంచేందుకు వీలుంటుంది.
- విలువైన బంగారం, వెండి వస్తువులు, నగదు ఇంట్లో ఉంచవద్దు. సాధ్యమైనంత వరకూ బ్యాంకు లాకర్లలో భద్రపరచుకోవాలి. లాకర్ల సదుపాయం లేని వారు తెలిసిన వారు లేదా బంధువుల ఇళ్లల్లో భద్రపరచుకోవాలి.
- బంగారు ఆభరణాలు, నగదును బ్యాగుల్లో ఉంచుకుని బస్సులు, ఇతర వాహనాల్లో ప్రయాణించే సమయంలో దొంగతనాలు జరిగే అవకాశం ఉన్నందున అప్రమత్తంగా ఉండాలి.
- ఎలక్ట్రీషియన్లు, ప్లంబర్లు, కార్పెంటర్లు, గ్యాస్ స్టౌల మరమ్మతుల పేరిట అపార్ట్‌మెంట్లకు వచ్చే అపరిచిత వ్యక్తులను అనుమతించరాదు.
- కాలనీల్లో ఎవరైనా అనుమానిత వ్యక్తులు సంచరిస్తే సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలి. లేదా 100, 112 నంబర్లకు ఫోన్ చేయాలి.
- వాహనాలను ఇంటి ఆవరణలోనే పార్కింగ్ చేసుకోవాలి. ద్విచక్ర వాహనాలకు తాళాలు వేయటంతో పాటు వీలైతే చక్రాలకు కూడా చైన్లతో కూడిన తాళం వేయాలి.
- పట్టణ ప్రజలు సాధ్యమైనంత వరకూ తమ ఇళ్లకు సీసీ కెమెరాలు అమర్చుకుంటే మంచిది. అవి ఆన్‌లో ఉండేలా చూసుకోవాలి.
- ఇంటి బయట, ఇంట్లో కనీసం ఒకటి రెండు లైట్లు వేసి ఉంచాలి.
- ఇంటికి ఇరువైపులా నమ్మకమైన వారుంటే ఇంటిని గమనిస్తూ ఉండమని చెప్పి వెళ్లాలి.
- పండగ సెలవులు ముగిసే వరకూ ఆయా కాలనీల సంక్షేమ సంఘాల వారు రాత్రి సమయాల్లో గస్తీ ఏర్పాటు చేసుకుంటే దొంగతనాలను అరికట్టవచ్చు.
- ఆభరణాలకు మెరుగు పెడతామని, తక్కువ రేటుకు బంగారం, వెండి నగలు అమ్ముతామని వచ్చే వారి పట్ల అప్రమత్తంగా ఉండాలి.
- అపార్ట్‌మెంట్లు, కాంప్లెక్స్‌ల వారు, మార్కెట్లు, ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలు, వ్యాపార సముదాయాల్లో 24/7 సెక్యూరిటీ గార్డులను విధిగా నియమించుకోవాలి.